

పాములేరులో ఇద్దరు గల్లంతు!

విషాదం మిగిల్చిన విహారయాత్ర

7

నీట్.. కొట్టారు!

నీట్ 2025 ఫలితాలు విడుదలయ్యాయి.. ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.. తిరుమల విద్యార్థి దర్బా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా 19వ ర్యాంక్, స్టేట్ 1వ ర్యాంక్ సాధించాడు. చాగల్లుకు చెందిన కొడవటి మోహిత్ శ్రీరామ్ ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు.. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించాడు. ఇలా పలువురు విద్యార్థులు మెరిశారు. నీట్‌ను సాధించారు. ఎంబీబీఎస్ చదవాలనే తమ కలను నిజం చేసుకున్నారు. తల్లిదండ్రుల ఆశకు ఊపిరి లూదారు. పలువురు ఐఐటీలో సీటు సాధించారు.

అమ్మానాన్న కష్టం చూసి చదివా..



నా పేరు కొడవటి మోహిత్ శ్రీరామ్.. మాది చాగల్లు..నాన్న సత్యనారాయణ, తల్లి నవీన.. మాది వ్యవసాయ కుటుంబం.. నన్ను ఉన్నత స్థానంలో చూడాలనే కష్టపడి చదివించారు. వారి కష్టానికి విలువ ఇవ్వాలని కదా.. ఆ కష్టమే నన్ను బాగా చదివేలా చేసింది. శనివారం విడుద లైన నీట్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 56వ ర్యాంకు రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించా. గతంలో ప్రకటించిన ఏపీఈఏపీ సెట్‌లో 9వ ర్యాంకు సాధించా. డాక్టర్ కావాలనే నా కల నిజం చేసుకుంటున్నా.

- కొడవటి మోహిత్ శ్రీరామ్, చాగల్లు

ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ కనిపించే దైవమైతే.. నాన్న కనిపించే ధైర్యం.. జీవితంలో తప్పటడుగు వేయకుండా.. తడబడకుండా కాచుకొంటూ.. వేలు పట్టి అడుగులు నేర్పించి.. నేనున్నాను రా! అనే భరోసా నాన్న. అమ్మ ప్రేమకు ప్రతి రూపమైతే.. నాన్న ప్రతి క్షణం నడిపించే బాధ్యత. ఓడినప్పుడు భుజం తట్టి.. గెలిచినప్పుడు పది మందికి చెప్పుకొని మురిసిపోయే వాడు నాన్న. బయటకు కఠినం.. లోపల మాత్రం బిడ్డల గురించి భయపడేవాడే నాన్న. పిల్లలు కష్టపడకూడదని తన ఇష్టాలను కూడా చిరునవ్వుతో మరిచిపోయేవాడు నాన్న. అడుగులు నేర్పిన చిటికిన వేలు నాన్నదే.. బుడిబుడి పాదాలతో తన్నుతూ ఆడుకున్న గుండెలు నాన్నవే.. చాలామంది జీవిత కథల్లో సూపర్ హీరో నాన్నే. నేడు అంతర్జాతీయ పితృ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న 'పితృదేవోభవ'..



నాన్నకు ప్రేమతో..

నేడు ఫాదర్స్ డే ప్రత్యేక కథనం

7లో



పట్టు పట్టారు!

ఉప్పాడ చేనేతకు చేయూత

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే చేనేత..రంగురంగుల చీరలు.. మోడళ్లు.. వీటిపై మనసుపారేసుకోని మహిళలంటూ ఉండరు.. ఎక్కడో హైదరాబాద్, విశాఖ నుంచి ఎందరో ప్రముఖులు ఇక్కడకు వచ్చి చీరలు కొనుగోలు చేస్తారు. సినీ సెలబ్రిటీలు సైతం తమ ఇళ్లల్లో వివాహాలు, ఇతర శుభ కార్యాలకు ఇక్కడి నుంచే చీరలు తీసుకెళతారు. ఏటా రూ.30 కోట్ల వరకు జరిగే ఈ వ్యాపారానికి ప్రోత్సాహం అందిస్తే చేనేత వ్యాపారం ఎదిగే అవకాశం ఉంది. అటు చేనేత కార్మికులకు సైతం మేలు జరగనుంది. ఈ నేపథ్యంలో ఉప్పాడ చేనేతకు మరింత చేయూత నందించి ఆధునిక డిజైన్లలో చీరలు తయారు చేసేలా ప్రభుత్వం తోడ్పాటు అందించబోతోంది. ఈ మేరకు రూ.15 కోట్లతో చేనేత అభివృద్ధి క్లస్టర్ ఏర్పాటుకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. తన సొంత నియోజకవర్గం కావడంతో పవన్ సైతం కేంద్రంతో మాట్లా డుతున్నారు. త్వరలో నిధులు విడుదలయ్యే అవకాశం ఉన్నట్టు చేనేత శాఖ అధికారులు చెబుతున్నారు.

1600 కుటుంబాలకు ఆధారం

ఉప్పాడ అంటే చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నై నుంచి మేలురకం నూలు తీసుకు వచ్చి ఇక్కడ మగ్గాలపై నేత కార్మికులు రక రకాల చీరలు నేస్తారు.ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి పేరుంది. ఉప్పాడ, పిఠాపురం, గొల్లప్రోలులో దాదాపు 1600 చేనేత కుటుంబాలు ఉండగా వీరిలో అనేక మంది పట్టు, జాంధానీ చీరలను మగ్గాలపై నేస్తారు. ఉప్పాడలో రెండు చేనేత సంఘాలు వీటిని తయా రుచేసి విక్రయిస్తాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేనేత ప్రోత్సాహానికి పథకం ప్రారంభించింది. నీడ్ బేస్డ్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ప్రాజెక్టు కింద ఉప్పాడ చేనేత క్లస్టర్ ప్రాజెక్టును ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటు పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ అయినందున ఇక్కడ చేనేతను మరింత ప్రోత్సహించాలని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రత్యేక ఆసక్తి కనబర్చి కేంద్రానికి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు.ఈ మేరకు ఉప్పాడలో 916 మంది ఇళ్లకు నేరుగా వెళ్లి ఇటీవల చేనేతశాఖ అధికారులు అభిప్రాయాలు సేకరించారు. మొత్తం రూ.15 కోట్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం వాటాగా రూ.11.85 కోట్లు ఇవ్వనుంది. మిగిలిన రూ.3.15 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇటీవల రాష్ట్ర చేనేత కమిషనర్ రేఖారాణి ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర చేనేత శాఖకు పంపించారు. ఈ ప్రాజెక్టుపై పవన్ సైతం కేంద్రంతో మాట్లాడుతున్నారు. త్వరలో నిధులు విడుదల కానున్నాయని కాకినాడ కలెక్టర్ వివరించారు.

- ఇన్నేళ్లకు మంచి రోజులు
- 15 చోట్ల చేనేత క్లస్టర్లు
- రూ.15 కోట్లతో ప్రతిపాదనలు
- త్వరలో నిధుల విడుదల
- ప్రాజెక్టుపై పవన్ సంప్రదింపులు
- చేనేతన్నలకు ఆధునిక శిక్షణ
- మారనున్న పిఠాపురం చిత్రం

ఇలా చేస్తారు..

ప్రాజెక్టు అభివృద్ధి కింద పిఠాపురం నియోజకవర్గంలో 15 చోట్ల చేనేతను ప్రోత్సహించడానికి పలు అంశాలు ప్రతిపాదించారు. ఉప్పాడలో రూ.1.40 కోట్లతో పనులు చేయబోతున్నారు. రూ.80 లక్షలతో క్వాలిటీ టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. రూ.60 లక్షలతో మెగా షోరూం ఏర్పాటు చేసి చీరలు విక్రయిస్తారు. యు.కొత్తపల్లిలో రూ.కోటితో డిజైన్ స్టూడియో నిర్మిస్తారు. రూ.80 లక్షలతో చీరలు, జాకెట్లు, ఇతర వస్త్రాలు కుట్టేలా యూనిట్ నిర్మించనున్నారు.తాటిపర్తిలో రూ.55 లక్షలతో శారీ స్ర్కీన్ పెయింటింగ్ సెంటర్ నిర్మించనున్నారు. రూ.50 లక్షలతో షోరూం నిర్మిస్తారు. రూ.60 లక్షలతో షాప్ అండ్ షాప్ కింద పాడుబడ్డ చేనేత సంఘం భవనాలు ఆధునీకీకరిస్తారు. చేబ్రోలులో నూలుకు రంగులు అద్దే యూనిట్ రూ.2.50 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. రూ.50 లక్షలతో షోరూం కట్టనున్నారు. దుర్గాడలో రూ.80 లక్షలతో గార్మెంట్ మేకింగ్ యూనిట్ స్థాపించాలని ప్రతిపాదించారు. చెందుర్తిలో రూ.55 లక్షలతో శారీ స్ర్కీన్ ప్రింటింగ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. గొల్లప్రోలులో రూ.50 లక్షలతో హోం ఫర్నీషింగ్ యూనిట్ స్థాపించనున్నారు. మొత్తం రూ.12 కోట్లతో చేనేతకు సంబంధించి ఆధునిక మోడళ్లలో చీరలు, జాకెట్లు డిజైన్ చేయడం, రకరకాల స్ర్కీన్ ప్రింటింగ్‌లు అందుబాటులోకి తేనున్నారు. రూ.1.50 కోట్లతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి జిల్లాలో చేనేత కార్మికులు, మహిళలకు ఆధునిక మోడళ్లపై శిక్షణ ఇస్తారు. దేశంలో ప్రముఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (ఎన్ఐఎఫ్‌టీ)ల నుంచి ప్రముఖ డిజైనర్లను ఉప్పాడ తీసుకు వస్తారు. నిపుణులతో రెండేళ్లపాటు శిక్షణ ఇప్పించనున్నారు. ఇందుకు రూ.3 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.



బై..బై.. వైసీపీ!

కూటమి వైపు.. ఫ్యాన్స్ చూపు

- పార్టీ మారేందుకు నేతలు సిద్ధం
- క్యూ కడుతున్న వైసీపీ నాయకులు
- అయినా అంగీకరించని టీడీపీ
- ఆమోదం తరువాతే చేరికలు
- సీఎం చంద్రబాబు వర్తమానం
- డిసెంబరులోనే స్థానిక ఎన్నికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిపక్ష వైసీపీ రెక్కలూడిపోతున్నాయి. ఇప్పటికే ఒక్కొక్కరుగా పార్టీ మారిపోతున్నారు. అవకాశమిస్తే క్యూకట్టేలా ఉన్నారు. వైసీపీ తన వైఖరి వల్లే ప్రజల్లో మరింత వ్యతిరేకత తెచ్చుకుంటోంది. ఇటీవల అమరావతిపై సొంత ఛానల్‌లో అక్కసు వెళ్లగక్కడమే అందుకు ఉదాహరణ. అమరావతి రాజధానిపై సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ చేసి వ్యాఖ్య తీవ్ర పరిణామాలకు దారి తీసిన సంగతి తెలిసిందే. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు నేతలు చేసిన పనులు, కొందరు కార్యకర్తలు, అధినేత జగన్ వ్యవహార శైలి ఆ పార్టీకి తీవ్ర నష్టం తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో గత సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వైసీపీ తుడుచుపెట్టుకుపోయింది. ఇటీవల జరిగిన టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ ఊసే వినిపించలేదు. దీంతో నేతలతోపాటు, కార్యకర్తలు దిగాలు పడుతున్నారు. దీనికితోడు స్థానిక సంస్థలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, జడ్పీల్లోనూ ఉన్న వైసీపీ ప్రతినిధులు నెమ్మదిగా జారుకుం టున్నారు. ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని పలువురు జడ్పీటీసీలు, సర్పంచ్‌లు కూటమిలో చేరారు. పిఠాపురంలో వైసీపీ నేత జనసేనలో చేరిపోయారు. తుని మునిసి పాలిటీ టీడీపీ వశమైంది. కొవ్వూరు మునిసిపల్ చైర్మన్ వైసీపీకి రాజీనామా చేశారు. టీడీపీలో చేరనున్నారు. నిడదవోలు మునిసిపాలిటీ జనసేనకు దక్కింది. ఇంకా అనేక మంది పార్టీ మారాలని చూస్తున్నా ఇటు ఆమోదం లభించడంలేదు.

రానున్నాయి.. స్థానిక ఎన్నికలు!

మునిసిపల్ పాలకవర్గాలకు 2021 మార్చి 10న ఎన్నికలు జరిగాయి. 18వ తేదీన చాలా ప్రమాణ స్వీకారాలు జరిగాయి. ఈ ఏడాది మార్చి 18తో పాలకవర్గాలకు నాలుగేళ్లు నిండిపోయాయి. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీ అప్రజాస్వామికం, దౌర్జన్యంగా వ్యవహరించడంతో అన్ని మునిసిపాలిటీల్లోనూ వైసీపీ గెలిచిన సంగతి తెలిసిందే. దీంతో అధికారం వైసీపీ వశమైంది. మొత్తం 12 మునిసిపాలిటీల్లో అప్పట్లో టీడీపీకి 50 మంది కౌన్సిలర్లు, జనసేనకు 18 మంది, బీజేపీకి 8, కాంగ్రెస్‌కు ఒకటి, వైసీపీకి 319 వచ్చాయి. వీరిలో ఇప్పటికే చాలా మంది పార్టీ మారారు. గ్రామ పంచాయతీలకు 2021 ఫిబ్రవరి 9 నుంచి 21వ తేదీ వరకూ ఎన్నికలు 4 దశల్లో జరిగాయి. ఆ ఎన్నికల్లో వైసీపీకి 805, టీడీపీ, మిత్రపక్షాలకు 143 సర్పంచ్ పదవులు లభించాయి. 805 మందిలో ఇప్పటికే చాలామంది కూటమిలో చేరారు. జడ్పీ ఎన్నికలకు 2021 ఏప్రిల్ ఒకటో తేదీనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు కేవలం 8వ తేదీనే పోలింగ్ జరిగేటట్టు ప్రకటించడం వివాదాస్పదమైంది. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కనీసం నాలుగు వారాలు గడువుతో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలి. కేవలం ఒకటో తేదీనే నోటిఫికేషన్ ఇచ్చి 8న పోలింగ్ తేదీ అని చెప్పడంతో ఇబ్బంది అయింది. అయినా వైసీపీ మొండిగా ఎన్నికలు నిర్వహించింది. కోర్టు వివాదాల నేపథ్యంలో 2021 సెప్టెంబరు 19న ఫలితాలు ప్రకటించారు. కానీ టీడీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ జడ్పీసీలంతా స్తబ్దుగా ఉన్నారు. జిల్లాలు విడిపోయినా.. జడ్పీ విభజన జరగలేదు. ఇప్పటికే చాలామంది జడ్పీటీసీలు కూటమిలో చేరగా, కొందరు జడ్పీటీసీలు సైలెంట్ అయ్యారు. ప్రస్తుతం కూటమి నేతలతో టచ్‌లో ఉన్నారు. పార్టీ మారేందుకు సిద్ధమంటున్నారు.

వస్తామన్నా.. వద్దు : చంద్రబాబు

ఇటీవల టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ ఎమ్మెల్యేలకు ఒక వర్తమానం పంపారు. వైసీపీ నుంచి వచ్చే వారిని ఇష్టానుసారం పార్టీలో చేర్చుకోవద్దని.. ముందు తమకు సమాచారం ఇచ్చి.. ఆమోదం పొందిన తర్వాతే చేర్చుకోవాలని చెప్పడం గమనార్హం. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కూడా ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో చాలామంది వైసీపీ నేతలు కూటమిలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నా రెడ్ సిగ్నల్ ఉంది. పైగా ఎమ్మెల్యేలకు ఆయా మునిసిపాలిటీలు, స్థానిక సంస్థల్లో అక్రమాలకు పాల్పడి ప్రజల్లో చెడ్డపేరు తెచ్చుకున్నవారిని చేర్చుకోవడానికి ఇష్టపడడం లేదు. కొందరు వస్తామన్నా వద్దని చెబుతున్నారు. ఇతరులను లాక్కోవడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. వచ్చే ఏడాది వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు ఉంది. కానీ నాలుగేళ్లు పూర్తవడంతో మునిసిపల్ చైర్మన్లు, సర్పంచ్‌లు, జడ్పీ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెడుతున్నారు. ఎందుకంటే వచ్చే ఫిబ్రవరికి సర్పంచ్‌లకు ఐదేళ్లు నిండిపోతాయి. వచ్చే మార్చి నాటికి మునిసిపల్ పాలకవర్గాల గడువూ ముగిసిపోతోంది. 2026 సెప్టెంబరు నాటికి జడ్పీటీసీలకు ఐదేళ్లు పూర్తవుతాయి. ఇంతలో కంగారు ఎందుకనేలా కూటమి నేతలు ఉన్నారు. ఎక్కువమంది టీడీపీ, జనసేన వైపే మొగ్గు చూపుతున్నారు. కానీ గ్రీన్ సిగ్నల్ అందడం లేదు. ఈ ఏడాది డిసెంబర్ నుంచే స్థానిక ఎన్నికల సందడి మొదలు కావచ్చు.

విశాఖలో ప్రధానమంత్రి కార్యక్రమానికి నేడు జిల్లా అధికారుల పయనం

యోగా డే ఏర్పాట్లలో పర్యవేక్షణ విధులకు హాజరు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే యోగా అంతర్జాతీయ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా ఏర్పాట్ల పర్యవేక్షణ విధులకు కాకినాడ జిల్లా అధికారులు ఆదివారం పయనం అవుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవుతున్నందున దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ బృందంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, కాకినాడ ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భారతి, కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రావు, జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు వెళుతున్నారు. అలాగే తహశీల్దార్లు గోపాలకృష్ణ, చిన్నారావు, చిరంజీవి, శ్రీనివాస్, కాసురాజు, తాతారావు, నరేష్‌లు బయలుదేరుతున్నారు. వీరందరూ ప్రధానమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు.

వారంరోజులపాటు ఇన్‌చార్జి తహశీల్దార్లుగా డీటీలు

ఏడుగురు తహశీల్దార్లు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిమిత్తం విశాఖపట్నం వారంరోజులపాటు వెళుతున్నందున ఆయా స్థానాల్లో డిప్యూటీ తహశీల్దార్లకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశాలిచ్చారు. వీటిలో పిఠాపురం, యు.కొత్తపల్లి, కిర్లంపూడి, గండేపల్లి, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి ఉన్నాయి.

రేపు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ఈనెల 16వతేదీన కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ప్రకటన వెలువరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు మీకోసం వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేయవచ్చునన్నారు.

18న ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు రాక

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీన కాకినాడ జిల్లాకు స్టడీ టూర్ నిమిత్తం ఏడుగురు ట్రైనీ ఐఏఎస్‌లు రానున్నారు. వీరు ఓఎన్‌జీసీ ఆన్‌షోర్, ఆఫ్‌షోర్ కార్యకలాపాలను పరిశీలిస్తారు. తొలుత జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు రిపోర్ట్ చేస్తారు. ఈ స్టడీ టూర్‌కు నోడల్ అధికారిగా జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ వ్యవహరిస్తారు. తిరిగి మర్నాడు 19వ తేదీన ట్రైనీ ఐఏఎస్‌లు ఇతర జిల్లాలకు బయలుదేరి వెళతారు.



పిఠాపురంలో తల్లికి వందనం లబ్ధిదారులతో సెల్ఫీ తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

జగన్ కళ్లు తెరిచి వాస్తవాన్ని చూడు : మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూన్14(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని మానుకుని కళ్లు తెరిచి వాస్తవం చూడాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ హితవు పలికారు. అమ్మకు వందనం పడిన లబ్ధిదారులు తమ పిల్లలతో పిఠాపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం వర్మను కలిశారు. కూటమి ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారితో వర్మ సెల్ఫీలు దిగారు. జగన్ హయాంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ఒక్కరికే లబ్ధి ఇచ్చి మిగిలిన వారిని విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఇద్దరు నుంచి ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం సొమ్ములు వేసి వారి కుటుంబాల్లో ఆనందం నింపారని తెలిపారు. సూపర్‌సిక్స్ అమలులో తమకున్న నిబద్ధత ఇది అని చెప్పారు. వాస్తవాలిలా ఉండగా జగన్‌అండ్‌కో మాత్రం తప్పుడు ప్రచారాల ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజలే వారికి తగురీతిలో బుద్ధి చెబుతారని వర్మ హెచ్చరించారు.



ఒకే ఇంటిలో అయిదుగురు చిన్నారులకు తల్లికి వందనం మంజూరైన కుటుంబంతో ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు తదితరులు

ఒక్కరికి కాదు.. అందరికీ ఆనందం

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది : ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూన్14(ఆంధ్రజ్యోతి):' తల్లుల కళ్లల్లో ఆనందం. ఆ ఇంట్లో ఒక్కరు కాదు. ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు పడుతున్నాయి. మెసేజ్ చూసుకుని తల్లులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇది కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో మరింత నమ్మకం, విశ్వాసం కలిగించే సూపర్‌సిక్స్ పథకమని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించిన తల్లికి వందనం పథకంలో సామర్లకోట పట్టణం భాస్కర్‌నగర్‌కు చెందిన ముస్లిం కుటుంబం గులాబ్, లాల్‌షాల సంతానం మొత్తం ఐదుగురికి రూ.65 వేలు జమ కావడంతో శనివారం డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి తదితర కూటమి పార్టీల నాయకులతో కలిసి లబ్ధిదారుల కుటుంబ సభ్యులను కలిసి ఎమ్మెల్యే చినరాజప్ప స్వీట్స్ అందజేశారు. ప్రభుత్వం అందించిన ఈ పథకంతో చిన్నారులను బాగా చదివించి ప్రయోజకులను చేసి కుటుంబం ఆర్థికంగా ఉన్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు, జనసేన అధ్యక్షుడు సరోజా వాసు, వాడపర్తి వీరభద్రరావు, మహంకాళి వెంకట గణేష్, బొందల రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్రికరణశుద్ధిగా సూపర్ సిక్స్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలను త్రికరణశుద్ధిగా అమలుచేస్తుందని, గత ప్రభుత్వంలో ఇంటికి ఒక్కరికే లబ్ధి చేకూర్చగా, కూటమి ప్రభుత్వం ఇంట్లో అందరి చిన్నారులకూ తల్లికి వందనం అమలుచేసి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమచేయడం జరిగిందని పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. సామర్లకోటలో శనివారం విలేకరులతో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)తో కలిసి మాట్లాడారు. విష ప్రచారంచేసిన వైసీపీ నాయకులు నేడు అజ్ఞాతవాసంలోకి వెళ్లారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు బీజేపీ ప్రభుత్వంతో కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నట్టు రామస్వామి చెప్పారు.

రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ భేష్

ఇప్పటివరకు 89.12శాతం రేషన్ సరుకుల పంపిణీ

తొలి నెలలోనే వేగవంతమైన బియ్యం, పంచదార పంపిణీ

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 14(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలశాఖ రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ ప్రారంభించిన తొలినెలలోనే వేగంగా పంపిణీ చేసింది. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఔరా అనిపించింది. ఎండీయూ వాహనాలను తొలగించి ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టింది. కాకినాడ జిల్లాలో 1060 రేషన్ దుకాణాలు ఉన్నాయి. దీనిలో 6,43,874 రేషన్‌కార్డుదారులు ఉన్నారు. ఇప్పటివరకు 5,73,882 కార్డుదారులకు సరుకులు పంపిణీ చేశారు. అంటే 89.12 శాతం పంపిణీ చేశారు. బియ్యంతోపాటు పంచదార కార్డుదారులకు అందజేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండీయూ వాహనాలతో ప్రజలు విసిగిపోయారు. వాహనం ఎప్పుడు వస్తుందో తెలియదు, ఎక్కడ పార్కింగ్ చేసి ఇస్తారో తెలియదు, పైగా పనులు మానుకుని రేషన్‌కోసం ఎదురు చూడాలి. ఎండీయూ వాహనాల వల్ల రేషన్ బియ్యం పెద్దఎత్తున పక్కదారిన పట్టిందనే ఆరోపణలు వినిపించాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం పాతపద్ధతిలో రేషన్ దుకాణాల్లోనే బియ్యం, పంచదార వంటివి ఇవ్వాలని ప్రారంభించి తొలి నెలలోనే సక్సెస్ అయింది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పంపిణీ చేస్తున్నారు. దీంతో ఇంట్లో ఒక్కరు ఏదొక వీలుదొరికిన సమయంలో రేషన్‌కు వెళితే రేషన్ సరుకులు లభిస్తున్నాయని జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో అత్యధికంగా రౌతులపూడి మండలంలో 91.46 శాతం పంపిణీ చేశారు. అలాగే కోటనందూరులో 90.79 శాతం, తుని 90.61శాతం, కాకినాడ రూరల్‌లో 90.40 శాతం, గొల్లప్రోలు 89.18శాతం, జగ్గంపేట 88.04శాతం, ప్రత్తిపాడు 87.69శాతం, పెద్దాపురం 87.,60 శాతం నమోదైంది. శంఖవరం 87.38, కాకినాడ అర్బన్ 87.09, గండేపల్లి 87, తొండంగి 86.97, సామర్లకోట 86.71, తాళ్లరేవు 86.60, పిఠాపురం 86.44, యూ.కొత్తపల్లి 86.22, ఏలేశ్వరం 86.11, కరప 85.52, కిర్లంపూడి 85.12, కాజులూరు 83.34, పెదపూడిలో 81.96 శాతం పంపిణీ చేశారు.

పంపిణీలో పారదర్శకత కోసం నిత్యం తనిఖీలు

రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ పారదర్శకంగా జరగాలని నిత్యం తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా రేషన్ దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే 6ఏ కేసులు నమోదు చేస్తున్నాం. ఈనెల ఒకటో తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలో వివిధ మండలాల్లో రేషన్ దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాం. ప్రతి రేషన్ దుకాణం బయట బోర్డులు ఏర్పాటు చేయించాం. దానిపైన రేషన్ డీలర్ ఫోన్ నెంబర్‌తోపాటు అధికారుల ఫోను నెంబర్లు కూడా రాయించాం. రేషన్ సక్రమంగా ఇవ్వకపోతే ఫిర్యాదు చేయవచ్చుని దానిపైన పేర్కొన్నాం. దీంతో జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీ పారదర్శకంగా సాగుతోంది. ఆదివారం కూడా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించాం.

- రుద్రరాజు సత్యనారాయణరాజు, జిల్లా పౌర సరఫరాలశాఖాధికారి

నేడు ఫాదర్స్ డే



నాన్నకు ప్రేమతో..

- రాజమహేంద్రవరం, కాకినాడ, అనపర్తి, ఉప్పలగుప్తం/ఆంధ్రజ్యోతి

ఒకప్పుడు నాన్నలు కఠినంగా ఉండేవారు. తమ పిల్లలకు విలన్లుగా కనిపించేవారు. కేవలం చదువుకు మాత్రమే విలువ ఇచ్చేవారు. ఏదైనా కొనమంటే పదేపదే ఆలోచించేవారు. ఇప్పుడు వద్దు అని కరాఖండీగా చెప్పేవారు. చదువుకొంటేనే మంచి భవిష్యత్తు అని వారి స్టైల్లో చెప్పేవారు. అయితే వారి మాటలు చెవికెక్కించుకున్న పిల్లలు నేడు మంచి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో పిల్లలు కూడా నాన్నను ఏదైనా అడగాలంటే భయపడేవారు. అమ్మ ద్వారానే నాన్నకు విషయం వెళ్లేది.. **కానీ నేడు...** నాన్నలు పిల్లలకు హీరోలుగా మారారు. చాలా మంది వారిని స్ఫూర్తిగా తీసుకుంటున్నారు. ఇక నాన్నలు కూడా వారి పిల్లలను గారాబంగా పెంచుతున్నారు. వారు అడిగింది ఏదీ కాదనకుండా కొనిచ్చేస్తున్నారు. నాన్న, పిల్లల మధ్య బంధం ఫ్రెండ్స్‌లా మారిపోయింది. ఏ విషయాన్నైనా నాన్నతో ఈజీగా పంచుకునే రోజులు వచ్చేశాయి. ఆఖరికి తాను ఫలానా అమ్మాయిని ప్రేమిస్తున్నాను అనే మాటను కూడా నేడు పిల్లలు సులువుగా నాన్నకు చెప్పేస్తున్నారంటే.. నాన్న మారిపోయాడని అర్థమవుతోంది.

● నాన్న ఎందుకో వెనుకబడ్డాడు..

బిడ్డలపై చూపించే ప్రేమలో తల్లిదండ్రుల పాత్రలు సమానం. కుటుంబం గురించి ఆలోచించే క్రమంలో, అవసరాలను తీర్చే దారిలో అమ్మానాన్నా సమానమే అయినా నాన్న కాస్త ఎక్కువగా టెన్షన్ పడుతూ ఉంటాడు. సాధారణంగా ఏ ఇంట్లో అయినా చూస్తే.. అందరికంటే తక్కువ బట్టలు, చెప్పుల జతలు నాన్నకే ఉంటాయి. వాటి గురించి కూడా పెద్దగా పట్టించుకోడు. కానీ పిల్లల మనసులో మాత్రం నాన్న ఎప్పుడూ కాస్త వెనుకబడుతూనే ఉంటాడు. ఎందుకంటే.. అమ్మ తిడిడే లాలనగా ఉంటుంది.. నాన్న కోప్పడితే ఆక్రోషంలా కనిపిస్తుంది. నిజానికి నాన్న కోపాన్ని పిల్లల భవిష్యత్తు ప్రతి క్షణం శాసిస్తూ ఉంటుంది. అందుకే బయటకు కఠినంగా ఉంటూ లోపల వెన్నపూసలా కరిగిపోతూ ఉంటారు. చాలా మంది పిల్లలు తల్లికి ఇచ్చినంత ప్రాధాన్యం తండ్రికి ఇవ్వరని సర్వేలు చెబుతున్న వాస్తవం. అయితే జీవిత కథలు చూసుకుంటే నాన్న నుంచి నేర్చుకున్న వాళ్లే ఎక్కువగా ఉంటారు. అది మంచి అయినా.. చెడు అయినా. కుటుంబానికి ఎంత చేసినా అధిక శాతం తండ్రులు పిల్లల దృష్టిలో చులకనే. దీనివల్ల లోలోపల కుమిలిపోయే తండ్రులు ఎంతో మంది ఉన్నారు. కాస్త ఎదిగిన పిల్లలు నీకెందుకు నేనున్నాగా అని నాన్నతో ఒక్క మాట అంటే మౌనంగా ఎంతో మురిసిపోతారు. ఆ మాటను వంద మందికి చెప్పుకొని గంతులు వేస్తారు. అందుకనే నాన్నను అర్థం చేసుకుంటే జీవితాన్ని ఔపోసన పట్టినట్టే. ఇక అంతర్జాతీయ పితృ దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ నెలలోని మూడో ఆదివారం జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 60 దేశాల్లో తండ్రుల గౌరవార్థం ఈ వేడుక నిర్వహిస్తున్నారు. మాతృ దినోత్సవం మాదిరిగానే పితృ దినోత్సవం ఉండాలనే తలంపుతో అమెరికాకు చెందిన సొనోరా అనే మహిళ పితృ దినోత్సవంపై ప్రచారం మొదలుపెట్టారు. దీంతో 1910లో మొదటిసారిగా ఫాదర్స్ డేని నిర్వహించారు.

మంచి స్నేహితులం.. - ఎస్పీ నరసింహ కిషోర్




'తూర్పు' ఎస్పీ నరసింహ కిషోర్.. తండ్రి ధర్మారావు

నాన్న దూసి ధర్మారావు. టీచర్, జూనియర్ లెక్చరర్‌గా పనిచేశారు. ఆయన చాలా ఫేమస్ పర్సనాలిటీ. ఆయన నన్ను ఎప్పుడూ స్నేహితుడి మాదిరిగానే చూశారు. బిగ్ రోల్ మోడల్. ఆయన పూర్తి ప్రభావం నా మీద ఉంది. చిన్నప్పటి నుంచీ ఆయనతో కలిసే తిరిగాను. ఆయన ప్రపంచం చాలా పెద్దది. గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆయన ప్రిన్సిపాల్‌గా చేసే సమయంలో 8, 9, 10 అక్కడే చదువుకున్నాను. మంచి సామాజిక, సాహిత్య సేవకులు. చరిత్ర సంస్కృతిని కాపాడడంలో గొప్ప కృషి చేశారు. మంచి రచయిత, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్. ఏ రోజూ నా జీవిత మార్గాన్ని నిర్దేశించలేదు. చాలా స్వేచ్ఛగా ఆలోచనలు చేసుకొనే అవకాశం ఇచ్చారు. ఆయనకు నెగిటివ్ ఆలోచనలు, మాటలు ఎప్పుడూ నచ్చేది కాదు. 'మంచి ఉద్యోగం చేస్తే చాలు. సొసైటీకి నీ కంట్రిబ్యూషన్ ఉంటే చాలు. టీచర్, అటెండర్ కూడా కంట్రిబ్యూట్ చేయవచ్చు. సామాజిక స్పృహ ఉండాలి. పక్కవాడి మంచి గురించి ఆలోచించాలి. సొసైటీని విమర్శించుకుంటూ బతకొద్దు. అప్పుడు మనల్ని వదిలేసి సమాజం ముందుకు సాగిపోతుంది. సమాజంలో అడ్డంకులను అధిగమించి మనం చేయాలనుకున్నది చేసుకుపోవాలి. పదిమందికి ఉపయోగంగా ఉండాలి' అని నిరంతరం చెబుతూ ఉండేవారు. 'ఆయన దినచర్య ఉదయం ఆరు గంటలకు ప్రారంభం అయ్యేది. ఉద్యోగం, సామాజిక సేవలు చూసుకొని రాత్రి 11గంటల సమయంలో ఇంటికి చేరేవారు. సమాజంలోని వివిధ అంశాలు, సేవ వంటి వాటిపై ఇద్దరి మధ్యా తరచు చర్చ నడుస్తుండేది. ఏ రోజూ ఇది చదువని ఆయన చెప్పలేదు. అల్లరి చేస్తున్నా ఏమీ అనేవారు కాదు. ఎవరికి వారే తమ తప్పు తెలుసుకొని దాని నుంచి బయటకు రావాలి. ఎవరో చెబితే తెలుసుకోవడం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఈరోజు బతికున్నామంటే చక్కగా, హ్యాపీగా ఉండాలి. కష్టాన్ని అంగీకరించకూడదు. దానిపై ఫైట్ చేయాలి. దుఃఖం వచ్చిందని అక్కడే ఆగిపోకూడదు. దాని నుంచి బయటపడే మార్గం కూడా మన దగ్గరే ఉంటుంది' అని చెప్పేవారు. ఆయన చాలా పుస్తకాలు రాశారు. రసతరంగిణి, స్టోరీ ఆన్‌స్టోన్ వంటి పుస్తకాలు రాశారు. ఆయన నాకు ప్రతి క్షణం గుర్తొస్తూనే ఉంటారు. నేను, సమాజం కూడా ఆయనను మరిచిపోయే రోజు ఉండదు. దురదృష్టవశాత్తూ ఆయన 2017లో కాలం చేసినా నాతోనే ఎప్పుడూ ఉంటారు.

- దూసి నరసింహ కిషోర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

మా నాన్నే హీరో

నాన్న పీఎంపీ.. పిల్లలు డాక్టర్లు



నా తండ్రి షేక్ చినవలియా. మాది ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి. నిరుపేద కుటుంబం. ఆయన తన తండ్రికి సహాయపడాలన్న ఆలోచనతో ఒక ఆసుపత్రిలో సహాయకుడిగా చేరారు. తర్వాత స్వగ్రామంలో పీఎంపీగా వైద్య సేవలందిస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. కానీ తన పిల్లలు తనలా సంచికట్టు డాక్టర్లు కాకూడదని, వైద్య వృత్తిలో పట్టభద్రులుగా చూడాలని కలలు గన్నారు. పిల్లలు వైద్యులుగా పట్టాలు తీసుకుని సమాజంలో గొప్పగా జీవించాలన్నది ఆయన సంకల్పం. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కుంటూనే మమ్మల్ని మెడిసిన్ చదివించారు. మేం ముగ్గురం. పెద్ద కుమారుడు అహ్మద్ అలీషా దంత వైద్యునిగా క్లినిక్ నడుపుతున్నారు. కుమార్తె హసీనా ప్రస్తుతం రావులపాలెం మండలం ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి. మూడో కుమారుడు అబ్దుర్‌రెహమాన్ బెంగళూరులో ఎంబీఏ చదువుతున్నాడు. పీఎంపీగా మా తండ్రి మమ్మల్ని వైద్య పట్టభద్రులుగా చూడాలని ఎన్నో ఆర్థిక ఇబ్బందులను తట్టుకున్నారు. తలకు మించిన భారం ఎందుకని పలువురు సలహాలిచ్చినా పట్టించుకోకుండా మా ఉన్నతి కోసం నిత్యం తపించారు. ఆయన కడుపున పుట్టడం నిజంగా ఎంతో అదృష్టం. ఎప్పటికీ మా నాన్నే మా హీరో.

నాన్న బాటలోనే రాజకీయాల్లోకి..

అనపర్తి శాసనసభ్యుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



తండ్రి మూలారెడ్డితో అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

ప్రతి ఒక్కరికి కొన్ని కలలుంటాయి. ఇలా ఎదగాలని, ఇలా స్థిరపడాలని ఉంటుంది. కానీ ఒక్కోసారి కుటుంబ ప్రభావంతో మనం కోరుకున్న దారి మారిపోతుంటుంది. నేను డాక్టర్ కావాలనుకున్నా. కానీ ఇంజనీర్ అయ్యా. కానీ కుటుంబ వారసత్వ రాజకీయాల ప్రభావంతో రాజకీయ నేతగా మారిపోయా. నా తండ్రి నల్లమిల్లి మూలారెడ్డి 1970 ప్రాంతంలో అనపర్తి మండలం రామవరం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై రాజకీయ ఆరంగ్రేటం చేశారు. తర్వాత తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా సమాజ సేవకు ముందుకు వచ్చి అనపర్తి ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు గెలిచి నియోజకవర్గ ప్రజలకు సేవలందించారు. నాకు మాత్రం డాక్టర్ కావాలనేది కల. అనుకోనివిధంగా ఇంజనీరింగ్ కోర్సు చదివి బీఈ పట్టా పొందా. పారిశ్రామికవేత్తగా పేరు తెచ్చుకోవాలని వంశీ పవర్ పేరుతో పవర్‌ప్లాంట్‌ను స్థాపించారు. కానీ ఎన్నికల సమయంలో తండ్రికి చేదోడుగా నిలిచేవాడిని. నా తండ్రికి నాటికలపై ఉన్న మక్కువతో ఏర్పాటుచేసిన మూలారెడ్డి కళా పరిషత్ బాధ్యతలను వేసుకున్నా. తర్వాత నా తండ్రి వారసుడిగా 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించా. తిరిగి 2024 ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీచేసి రెండవ పర్యాయం ఎమ్మెల్యేగా గెలుపొందా. సాధరణంగా ఒక కుటుంబంలో తాను, భార్య బిడ్డలు బావున్నారా అనే చూసుకుంటారు.. కానీ తనను నమ్ముకున్న కుటుంబాలు ఎలా ఉన్నాయి, వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని నిత్యం ఆలోచనలతో ముందుకుసాగుతూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న మూలారెడ్డికి కొడుకుగా జన్మించడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నా. ఆయన చూపిన బాటలోనే పయనిస్తున్నా.

నీట్-2025 ఫలితాల్లో 'తిరుమల' ప్రభంజనం

కిరీటికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ఆలిండియా స్థాయి ర్యాంక్‌లతో సత్తాచాటిన విద్యాసంస్థ



ర్యాంకర్లతో చైర్మన్ తిరుమలరావు



స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ రామ్‌కిరీటి

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్-2025 ఫలితాల్లో రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ విద్యార్థులు ఆలిండియా స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లతో ప్రభంజనం సృష్టించారు. ఓపెన్ కేటగిరిలో దర్భా కార్తీక్ రామ్‌కిరీటి ఆలిండియా స్థాయిలో 19వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా తిరుమల విద్యాసంస్థలో శనివారం విజయోత్సవం జరిపారు. ర్యాంకర్లకు స్వీట్లు తినిపించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో తిరుమలరావు మాట్లాడారు. తమ విద్యార్థులు కె.ఈష్విత్ కశ్యప్ 12వ ర్యాంక్, టి.సాహితి 32వ ర్యాంక్, కేవీవీ నాగసాయి పవన్ 154వ ర్యాంక్, ఎం.సూర్య సంతోష్ రెడ్డి 880వ ర్యాంక్, ఎల్.అభిషేక్ 888వ ర్యాంక్, టి.రామచంద్రన్ 1145వ ర్యాంక్, ఎల్.వర్షిత్ 1237వ ర్యాంక్, పి.ప్రశంస 1851వ ర్యాంక్, కె.విన్షిత 1909వ ర్యాంక్ కైవసం చేసుకున్నారని తెలిపారు. అలాగే వెయ్యి లోపు 6 ర్యాంక్‌లు, 5వేలలోపు 35, పది వేల లోపు 71, 20వేలలోపు 138, 30వేలలోపు 189 ర్యాంక్‌లు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థులు 250 మంది పైబడి ఎంబీబీఎస్ సీట్లు సాధించగలరన్నారు. ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరిలతో కలిసి తిరుమలరావు అభినందించారు.

వైద్యురాలిగా సేవలందిస్తా

టి.సాహితి, 32వ ర్యాంకర్



నీట్‌లో ఆలిండియా స్థాయిలో 32వ ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. తిరుమల విద్యాసంస్థల్లో చదువుకోవడం వల్లే ర్యాంక్ సాధించగలిగాను. ఫ్యాకల్టీ ఇచ్చిన ప్రోగ్రామ్స్‌ను ఎప్పటికప్పుడు చూసుకుంటూ సలహాలు, సూచనలు పాటిస్తూ కష్టపడి చదివాను. చైర్మన్ తిరుమలరావు ప్రోత్సాహం, నా తల్లిదండ్రులు టీవీ ఆర్ రాజు, నాగమణిల ప్రోద్బలం ఉంది. ఆర్థోపెడిక్ వైద్యురాలిగా సేవలందించాలనే లక్ష్యంతో చదువుతున్నా.

శివమణిదీప్‌కు 92వ ర్యాంకు



శివమణిదీప్

రావులపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెనికి చెందిన తుమ్మోరి శివమణిదీప్ నీట్ ఫలితాల్లో 92(ఎంబీసీ ఎన్‌సీఎల్) ర్యాంకు సాధించాడు. ఎంఎస్ న్యూరోసర్జన్ చేయడమే లక్ష్యంగా ప్రిపేర్ అయినట్టు మణిదీప్ తెలిపాడు. నీట్ ఫలితాల్లో మంచి ర్యాంకు సాధించడంతో తనతో పాటు కుటుంబ సభ్యులు ఆనందిస్తున్నార న్నారు. అతడి తండ్రి వెంకటరత్నం రైల్వే ఉద్యోగి కాగా, తల్లి నాగలక్ష్మి గృహిణి.

సంజనకు 227వ ర్యాంకు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో జిల్లా కాకినాడ సర్పవరానికి చెందిన బొర్రా సంజన ఆల్ ఇండియా 227వ ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉంది. దేవుని మీద నమ్మకం వల్ల ఇది సాధ్యమైంది. తల్లిదండ్రులకు కృతజ్ఞతలుతెలియజేయాలనుకుంటున్నా.



తల్లిదండ్రులతో సంజన

పాములేరు వాగులో ఇద్దరు యువకుల గల్లంతు



గల్లంతైన సాలీష్, రవితేజ ఫైల్‌ఫొటోలు

మారేడుమిల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన అల్లూరి సీతరామరాజు జిల్లా మారేడుమిల్లి పాములేరు వాగులో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. శనివారం విజయవాడ నుంచి 10 మంది స్నేహితులు మారేడుమిల్లి పర్యాటకానికి వచ్చారు. పాములేరు వాగులో డి.సాలీస్ (23), కటకం రవితేజ (30), మరో ఇద్దరు యువకులు స్నానానికి దిగారు. వాగులో వారు గల్లంతవుతుండగా తోటి స్నేహితులు రక్షించే ప్రయత్నం చేశారు. ఇద్దరు ప్రాణాలతో బయటపడగా సాలీస్, రవితేజ గల్లంతయ్యారు. దీంతో మిగిలిన స్నేహితులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు శనివారం రాత్రి వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ గల్లంతైన ఇద్దరు యువకుల ఆచూకీ లభించలేదు.

'ఏయూ' దూరవిద్య తరగతులు ప్రారంభం

కాకినాడ రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2022 విద్యాసంవత్సరం ఫైనల్ ఇయర్, 2024 క్యాలెండర్ ఇయర్ 3,4 సెమిస్టర్లు, క్యాలెండర్ ఇయర్ 2025 1,2వ సెమిస్టర్ విద్యార్థులకు శనివారం తరగతులు ప్రారంభమైనట్టు పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అంజనేయులు తెలిపారు. బీఏ,బీకామ్ విద్యార్థులకు వారాంతపు తరగతులు కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 5.30 వరకూ జరుగుతాయన్నారు. ఈ తరగతులను జూలై 13వరకూ వారంలో ప్రతీ శని, ఆదివారాలు నిర్వహించనున్నామని ఇతర వివరాలకు 9848405370కు ఫోన్‌చేయాలని సెంటర్ సమన్వయకర్త డాక్టర్ కె.నాగేశ్వరావు తెలిపారు

తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి



నదిలో శివ మృతదేహం

కోటనందూరు, జూన్14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ జిల్లా పాతగాజువాకకు చెందిన మునుశాల శివ స్థానికంగా రెండేళ్ల నుంచి నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం తాండవ నదిలో స్నానానికి దిగి మృతిచెందాడు. దీంతో స్థానికులు ఎస్ఐ టి.రామకృష్ణకు తెలిపారు. గాజువాకలో ఉన్న మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తునికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

'ఆదిత్య' విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

● అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం

కాకినాడ రూరల్,జూన్14(ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచి అఖిల భారతస్థాయిలో 109, 227, 890 ర్యాంకులు కైవసం చేసుకున్నారని విద్యా సంస్థల కార్యదర్శి ఎస్.కృష్ణదీపక్‌రెడ్డి తెలిపారు. వీరంరెడ్డి సాయిభవ్యహర్షిణి 625 మార్కులతో 227వ ర్యాంకు, దగ్గుమటి సవన్‌కార్తికేయ 109వ ర్యాంకు, డి.శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు సాధించారన్నారు. అంతేకాకుండా 720 మార్కులకుగానూ 550మార్కులపైన 12మంది ఆదిత్య విద్యార్థులు పొందినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమర్యాంకులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణనిచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్ రెడ్డి, హాస్టల్స్ డెరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ, ప్రిన్సిపాల్ మొయినా అభినందించారు.



సవన్ కార్తికేయ 109వ ర్యాంకు | సాయిభవ్యహర్షిణి 227వ ర్యాంకు | శ్రీనివాస రిషిత్ 890వ ర్యాంకు

వైద్యుల నిర్లక్ష్యంతో పసికందు మృతి

తాళ్లరేవులో కుటుంబసభ్యుల ధర్నా



తాళ్లరేవులో ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

తాళ్లరేవు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైద్యుల నిర్లక్ష్యంతో ముక్కుపచ్చలారని పసికందు మృతిచెందిందని, తమకు న్యాయం చేయాలని కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన బాధితులు తాళ్లరేవు ఆసుపత్రి వద్ద మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. పెదబొడ్డువెంకటాయపాలెనికి చెందిన చెక్కా మాధురి డెలివరీ కోసం తాళ్లరేవు ఆసుపత్రిలో చేరింది. శనివారం తెల్లవారుజామున ఆమెకు పురిటినొప్పులు రాగా వైద్యులు ఆసుపత్రిలో ఉండి కూడా పట్టించుకోకపోవడంతో స్వీపరు డెలివరీ చేసింది. శిశువు ఉమ్మ నీరు ఎక్కువ తాగడంతో మృతి చెందిందని వైద్యులు బాధితులకు చెప్పకుండా అంబులెన్స్‌లో కాకినాడ తరలించారు. కాకినాడ ప్రభుత్వాసుపత్రి వైద్యులు శిశువు మరణించిందని చెప్పడంతో మృతదేహంతో బాధితులు, బంధువులు తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. రోడ్డుపై బాధితులు బైఠాయించి సూపరింటెండెంట్, డ్యూటీ డాక్టరు స్నేహలత, సిబ్బందిని సస్పెండ్ చేసి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బాధితులు, బంధువులు ధర్నా చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కోరంగ ఎస్ఐ సత్యనారాయణ, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు. ఆందోళనకారులతో ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, కాకినాడ ఆర్డీవో మల్లిబాబు చర్చలు జరిపి న్యాయం చేస్తామని ఆందోళన విరమించారు. విచారణ కమిటీ సభ్యులు వినోద్, సుజాత తాళ్లరేవు ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించి కలెక్టరు నివేదించి 48 గంటల్లో చర్యలు తీసుకుంటామన్నారు. స్టాఫ్‌నర్సు ఇందిర నిర్లక్ష్యం కారణంగా భావించి సస్పెండ్‌చేసినట్టు తెలిపారు.

దోపిడీకి బయలుదేరి.. గంజాయితో పట్టుబడి...

● కొవ్వూరులో ఏడుగురి అరెస్ట్

● కారు, కత్తులు, సెల్‌ఫోన్లు స్వాధీనం



కొవ్వూరులో గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసిన పోలీసులు

కొవ్వూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గంజాయితో ఏడుగురిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. కొంతమంది వ్యక్తులు కారులో గంజాయి తరలిస్తున్నారని సమాచారం రావడంతో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జి వద్ద కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, తాళ్లపూడి ఎస్ఐ టి.రామకృష్ణ శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. కారులో అనుమానస్పదంగా సంచరిస్తున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 26 కిలోల గంజాయి, బాలినో కారు, 2 కత్తులు, ఇనుపరాడ్డు, 5 సెల్ ఫోన్లు, రూ.1130 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించి వివరాలు తెలుసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండలం మార్టేరుకి చెందిన సాకావంశీ, తణుకు పొటికచ్చివారి వీధికి చెందిన ఇజ్జాడ పాపినాయుడు, పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి సామేలు, పాలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్, పెరవలికి చెందిన చినిమిల్లి శివకృష్ణ, సవరపు ప్రవీణ్ కలిసి ఒక ప్రైవేటు ట్రావెల్స్ నుంచి బాలినో కారును అద్దెకు తీసుకుని దోపిడీ చేయడానికి నిర్ణయించుకుని బయలుదేరారు. దొంగతనం చేయడానికి ఇనుపరాడ్డు, పెద్ద కత్తి, చిన్న కత్తిని కారులో పెట్టుకుని శ్రీకాకుళం జిల్లా చిలకపాలెంలో బంగారపు షాపులో దొంగతనం చేయడానికి సన్నాహం చేసుకున్నారు. ముందుగా రెక్కీ నిర్వహించి అక్కడ నుంచి వస్తూ అల్లూరి సీతారామరాజు జిల్లా దారవరంలో 26 కిలోల గంజాయిని తీసుకుని కారులో పెట్టుకుని పెరవలి వస్తున్నారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోలిగేటుసెంటర్‌లో శనివారం మధ్యాహ్నం వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు కారును నిలుపుదలచేసి అనుమానస్పదంగా కనిపించిన ఏడుగురిని విచారించి అరెస్టు చేశారు. ఏడుగురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు పం పించామన్నారు. కేసులో ప్రతిభ కనబర్చిన సీఐ విశ్వం, ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ అభినందించారు.

కొండగుంటూరులో గంజాయితో ఇద్దరి అరెస్టు

రాజానగరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొండగుంటూరులోని ఒక లేఅవుట్‌లో రేకుల షెడ్ ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం సాగిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో శనివారం డీఎస్పీ శ్రీకాంత్, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ ఈ వివరాలను వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రం మల్కాజిగిరి జిల్లా చిత్రకొండ మండలం దొరగుడ పంచాయతీకి చెందిన చంద్ర కులదీప్ అలియాస్ సురేష్, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం పొల్లూరుకి చెందిన చందన్ మండల్ గంజాయిని నిల్వ చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కారులో గంజాయి తీసుకొచ్చినట్టు తెలుసుకుని శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. గంజాయితో ఇద్దరిని అరెస్ట్ చేశారు. 11 ప్యాకెట్లలో 23.101 కిలోల గంజాయిని గుర్తించారు. వ్యాన్, కారు, 2 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, సురేష్, చందన్‌ను కోర్టులో హాజరుపరిచామని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ వ్యాపారానికి సూత్రధారి రఘువీర్ రాయ్, అతడి భార్య ప్రశాంతి పరారీలో ఉన్నట్టు వివరించారు. ఈ కేసులో చురుకుగా వ్యవహరించిన ఎస్ఐ నాగార్జున, సిబ్బంది కరీం, సురేష్, త్రిమూర్తులు, మహేశ్వరరావు, మురళీ, రాంప్రసాద్‌ను అభినందించారు. సమావేశంలో ఎస్ఐలు నాగార్జున, ప్రియ కుమార్, నారాయణమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

కొబ్బరిచెట్టు పై నుంచి పడి..



అశోక్ (ఫైల్)

మామిడికుదురు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిచెట్టు చెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం నగరం తాడివారి మెరకలో శుక్రవారం రాత్రి జరిగింది. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాడి అశోక్ కుమార్ (35) శుక్రవారం కొబ్బరి బొండాల కోసం చెట్టు ఎక్కి జారి పడడంతో తీవ్రగాయాలయాయి. రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పెయింటర్‌గా పనిచేసే అశోక్‌కుమార్‌కు భార్య నాగమణి, 15ఏళ్ల కుమార్తె స్వప్న, 13ఏళ్ల కుమారుడు సంతోష్ ఉన్నారు. తండ్రి మరణించడంతో చిన్నారులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

తమిళనాడుకు తరలిస్తున్న బాల కార్మికుల గుర్తింపు

రాజమహేంద్రవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు రైలులో తరలిస్తున్న బాల కార్మికులను గుర్తించి సంరక్షణా కేంద్రానికి పంపించామని ప్రభుత్వ రైల్వే పోలీసు (జీఆర్పీ) ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ టి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీఎస్ఆర్పీ జయరాంప్రసాద్ ఉత్తర్వులతో జీఆర్పీ, ఆర్పీ ఎఫ్ పోలీసులు బచ్‌పన్ బచావో ఆందోళన్ టీమ్‌తో కలిసి రాజమహేంద్రవరంలో రైళ్లలో తనిఖీలు చేపట్టామన్నారు. శనివారం తెల్లవారు జామున జసిద్- తాంబరం వారాంతపు రైలులో తనిఖీలు చేస్తుండగా 10మంది బాలబాలికలను భవన నిర్మాణ పనుల నిమిత్తం తమిళనాడుకు తరలిస్తుండడం గుర్తించామన్నారు. ఛత్తీస్‌గఢ్‌కి చెందిన మనీషా, సరిత, సుమి పొటెల్, జార్ఖండ్‌కి చెందిన తురం సవ్యాన్, లవకుష్‌రామ్, కరణ్ కుమార్, బస్దేవ్‌షా, బీహార్‌కి చెందిన విక్రమ్‌కుమార్ పాశ్వాన్, రోహిత్ కుమార్, ఉమాకాంత్ కుమార్‌లను జిల్లా బాలల సంరక్షణ సమితికి అప్పగించామన్నారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేసి జార్ఖండ్‌లో జసిద్ జీఆర్పీకి పంపారు.

298 సముద్రపు తాబేళ్లు స్వాధీనం

గోకవరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న 298 సముద్రపు తాబేళ్లను శనివారం గోకవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పవన్‌కుమార్ వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరంలోని కాజా రామ్‌కుమార్‌కు చెందిన ఖాళీ స్థలంలో అనుమానాస్పదంగా ఉన్న ఏడు గోనె సంచులను స్థానికుల సమాచారంతో గుర్తించామని, వాటిని తెరిచి చూసేసరికి 298 సముద్రపు తాబేళ్లు ఉన్నాయన్నారు. తాబేళ్లను అక్రమ రవాణా చేస్తున్నట్టు విచారణలో తెలుసుకుని వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించామన్నారు. కాగా వాటిలో 22 తాబేళ్ల మృతి చెందినట్టు అటవీ అధికారులు తెలిపారు. మిగిలిన తాబేళ్లను దేవీపట్నం మండలం పోసమ్మగండి సమీపంలోని గోదావరిలో విడిచి పెట్టినట్టు చెప్పారు. కాగా తాబేళ్లను రవాణా చేస్తూ పరారైన నిందితులను కోరుకొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



గోకవరంలో తాబేళ్లతో ఉన్న గోనె సంచులు

కిర్లంపూడిలో అధిక వర్షపాతం

కిర్లంపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలోనే కిర్లంపూడి మండలంలో 28.2 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు ఏఎస్‌వో నాయుడు తెలిపారు.

పాఠశాలలు, ఆసుపత్రుల్లో యోగాంధ్ర

పిఠాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో శనివారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో వైద్యులు, సిబ్బందితో యోగాచేయించారు. కుమారపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వాసుపత్రి సూ పరింటెండెంట్ డాక్టర్ సుజాత, పిఠాపురం ఎంపీడీవో చిన్నారావు, యోగాగురువు వనం సత్యప్రియ, యోగా కోచ్‌లు వెంకట్, స్నిగ్ధ, వైద్యులు, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కొత్తపల్లి: ప్రతీఒక్కరూ యోగా సాధన చేయడంద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని యోగా ట్రైనర్ సూర్యారావు అన్నారు. కొండెవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహిం చిన యోగా ధ్యాసన కార్యక్రమంలో ఆయన యోగా సాధన చేయడం ద్వారా మంచి ఆరోగ్యం, ప్రశాంత, మానసిక రుగ్మతలను నివారించే ఏకైక సాధన యోగా అన్నారు. ఈనెల 22న దేశ


పిఠాపురంలో యోగా చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వ్యాప్తంగా చేపట్టే జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించాలని ట్రైనర్ సూర్యారావు విజ్ఞప్తి చేశారు. ఈ యోగా సాధనలో ఎంపీటీసీ దుళ్ల సత్తిబాబు, టీడీపీ నాయకులు వేమగిరి రాంబాబు, కందా అన్నవరం, జనసేన నాయకులు మారిశెట్టి బుజ్జి,పంచాయతీ కార్యదర్శి నాగవేణి, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో యోగా విజయవంతం

కలెక్టరేట్(కాకినాడ): కాకినాడనగరంలో రెడ్‌క్రాస్ వారి వికలాంగుల బాలుర పాఠశాలలో శనివారం యోగా తరగతులు నిర్వహించారు. విద్యార్థులు యోగాసనాలు వేశారు. రెడ్‌క్రాస్ యోగా శిక్షకులు పల్లవి, కార్యదర్శి శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలికలకు యోగాలో శిక్షణ

కాకినాడ సిటీ: ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక మహర్షి సాంబమూర్తి దివ్యాంగ బాలికల ఆశ్రమ పాఠశాల బాలికలకు, ఉపాధ్యాయులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. ఈ ప్రత్యేక యోగా శిక్షణా తరగతులను ఆంధ్రప్రదేశ్ యోగ విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ప్రారంభించిన పాఠశాల చైర్మన్ జవహర్ ఆలీ మాట్లాడుతూ యోగాతో మాత్రమే ప్రపంచాన్ని ఏకం చేయవచ్చన్నారు. యోగా శిక్షకురాలు కల్పన, పాఠశాల హెచ్‌ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు పద్మ, దివ్యాంగ బాలికలు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర కార్యక్రమం

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 గంటలకు కొప్పవరం జంక్షన్ ఏడీబీ రోడ్డు కార్యాలయంలో యోగా ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలు ప్రారంభం

కాకినాడ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రిహేబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్సీఐ) న్యూఢిల్లీ వారిచే గుర్తింపు పొందిన రెండు సంవత్సరాల వ్యవధిగల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైనట్లు ఈడీ ఎస్.పెద్దిరెడ్డి తెలిపారు. ఉమా మనోవికాసకేంద్రం కాకినాడవారి ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈనెల 30 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఇంటర్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక జాబితాను జూలై 14న విడుదల చేస్తామని తెలిపారు. ఈకోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఏపీ ప్రభుత్వం నిర్వహించు డీఎస్సీ, కేంద్రీయ విద్యాల యాలలోనూ, సమగ్రశిక్షలో ఐఈఆర్పీ రీసోర్సు ఉపాధ్యాయులుగా, జనరల్ బీఈడీ చేసిన వారు ఈ కోర్సుచేస్తే ప్రత్యేక డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్స్‌కు అర్హులన్నారు. వివరాలకు 9494861919కు ఫోన్‌చేయాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూచించారు.

మత్స్యకారులు సుఖసంతోషాలతో జీవించాలి

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడసిటీ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద సమృద్ధిగా లభించి మత్స్యకార కుటుంబాలు సుఖ సంతోషాలతో జీవించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వేట విరామం అనంతరం మళ్లీ సముద్రంలో వేటకు బయలుదేరే సందర్భాన్ని పురస్కరించుకుని కాకినాడ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటుఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం శ్రీగంగమ్మ బతల్లికి మత్స్యకారులు ఘనంగా పూజలు చేశారు. స్థానిక ఏటిమొగ రోడ్డులోని శ్రీ గణపతి, కాలభైరవస్వామి, మత్స్యనారాయణస్వామి, గంగమ్మతల్లి ఆలయంలో వేద పండితులచే హోమం, పూజలు నిర్వహించారు. సముద్ర దేవతగా కొలిచే గంగమ్మతల్లి శాంతించి సముద్రంలో ఎటువంటి ప్రమాదాలు కలుగకుండా ఉండాలని మత్స్యకారులు పూజలు చేశారు. ఈ సందర్భంగా గంగమ్మతల్లికి కుంభం సమర్పించి, మత్స్య సంపద విరివిగా లభించాలని, మత్స్యకార కుటుంబాలు ఆనందంగా ఉండాలని ఎమ్మె


హోమంలో ద్రవ్యాలు వేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

ల్యే కొండబాబు ప్రార్థించారు. అనంతరం సుమారు 4వేల మందికి భారీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ నాయకుడు వాసిరెడ్డి ఏసుదాసు, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, బోటుఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నాటి ధర్మారావు, కోశాధికారి చింతా పేర్రాజు, మత్స్యకార నాయకులు పినపోతు తాతారావు, మల్లాడి రాజు, పాలెపు ధర్మారావు, లంకే నూకరాజు పాల్గొన్నారు.


సామర్లకోటలో సమస్యలపై మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప


చంద్రబాబు, కొండబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

భాస్కర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో అన్ని వార్డులలో గడిచిన అయిదేళ్లుగా తిష్టవేసి ఉన్న అన్ని సమస్యల పరిష్కారానికి తాను దశలవారీగా కృషిచేస్తానని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మ కాయల చిన రాజప్ప పేర్కొన్నారు. శనివారం సామర్లకోట భాస్కర్‌నగర్‌లో పలువీధులను పలువురు మహిళల కోర్కె మేరకు ఎమ్మెల్యే చిన రాజప్ప పరిశీలించారు. వార్డులో రోడ్లు, డ్రెన్లు, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాలను కలుగజేస్తామన్నారు. అర్హులైన పేదలను గుర్తించి అందరికీ ఇంటి స్థలంతోపాటు ఇల్లు నిర్మించి ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన రాజప్ప వెంట డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, జనసేన అధ్యక్షుడు సరోజా వాసు, కౌన్సిలర్ బలుసు శ్రీనివాసు పాల్గొన్నారు.

చంద్రబాబు, కొండబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

కాకినాడసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం నిధులు విడు దల చేసిన సందర్భంగా స్థానిక 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పాలిక నాని ఆధ్వర్యంలో శని వారం స్థానిక బాపూజీ నగర్‌లో కేక్ కట్‌చేసి పంచారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కాకినాడసిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిరుకూరి శ్రీనివాస్‌చౌదరి, సోమిశెట్టి కుమార్, ఈడేటి నాగేంద్ర, పాలిక సాయి సూర్య, కంది కృపానందం, పెదపూడి కుమార్, డబ్బీరు జగదాంబ, కంటిపూడి సీతామహాలక్ష్మి, వెంకటరమణ, చింతా భైరవస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రపంచ రక్తదాతల దినోత్సవం


రక్తదానం చేస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 14(ఆంధ్రజ్యోతి):ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రోటరీబ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. క్లబ్ అధ్యక్షుడు అల్లె యాళ్ల రత్నారావు, కార్యదర్శి దులుపూడి రామకృష్ణ, జిల్లా చైర్మన్ పడాల సూర్యనారాయణరెడ్డి, సభ్యులు కోలా సాయిబాబా, వి.గోవింద్, జి.జయసూర్య, బి.వెంకటాచలరావు, ఎం.సతీష్, గోపీకృష్ణ రక్తదానం చేశారు. ప్రోగ్రాం చైర్మన్ టీఆర్ ఠాగూర్, దిలీప్‌కుమార్, రోటరీ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ పి.కామరాజు, యక్కల వీరమోహనరావు, సేతు మాధవరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోదండరామపురం మున్సిపల్ పాఠశాల మూసివేత

● అర్థాంతరంగా మూసివేయడంపై అనుమానాలు
● అయోమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు


సామర్లకోట శివారు కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల

సామర్లకోట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ శివారున ఉన్న కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ప్రస్తుత విద్యాసంవత్సరంలో మూసివేశారు. వేసవి సెలవుల అనంతరం పట్టణంలో అన్ని మున్సిపల్ పాఠశాలలు తెరిచినప్పటికీ కోదండరామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల తెరవని విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా కోదండరామ పురం దళితుల చిన్నారులకు విద్యాసదుపాయాలు కల్పిస్తున్న ఈ పాఠశాలను అర్థాంతరంగా మూసివేయడం వెనుక అంతరార్థం అంతు చిక్కడంలేదు. గత ఏడాది ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు నేడు ఏ పాఠశాలకు వెళ్లాలో తెలియక చిన్నారుల తల్లిదండ్రులు అయోమయానికి గురవుతున్నారు. ఇప్పటికే గత ఏడాది పట్టణంలోని జగ్గమ్మగారిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను మూసివేసిన విషయం విదితమే. పట్టణంలో రోజురోజుకూ పలు ప్రైవేట్ పాఠశాలలు, కిడ్స్ పాఠశాలలు జోరుగా ప్రారంభిస్తున్న తరుణంలో పేద విద్యారులకు ఎంతో అందుబాటులో ఉండే మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు మూసివేస్తుండడం పట్ల పలువురు మేధావులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ సత్వరం స్పందించి సామర్లకోట పట్టణంలో మూసివేసిన మున్సిపల్ పాఠశాలల మూసివేతకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి వాటిని పునఃప్రారంభించాలని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పల కొండ శనివారం డిమాండ్ చేశారు. కాగా కోదండ రామపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మూసివేసిన విషయం వాస్తవమేనని ఎంఈవో శివరామ కృష్ణయ్య స్పష్టం చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం


విజేతలకు మెమెంటోలు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పరిశోధన ప్రధానంగా వైద్య విద్య కొనసాగాలి

● ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐవీరావు

● వైభవంగా ఎరెవ్నా 4.0 ముగింపు

జీజీహెచ్(కాకినాడ) జూన్14 (ఆంధ్రజ్యోతి): వైద్య విజ్ఞాన సదస్సు ఎరెవ్నా 4.0 వైభవంగా జరిగింది. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్, కోర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ విశ్రాంత వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐవీరావు, జెఎన్‌టీయూకే మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ మురళీకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈనెల 12 న మొదలైన ఎరెవ్నా సదస్సు మూడురోజులపాటు సాగింది. ఈసదస్సుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి 600 మందికి పైగా వైద్య విద్యార్థులు హాజరయ్యారు. కాకినాడ జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో గురువారం డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. వర్క్‌షాపులు, పేపర్ ప్రజంటేషన్‌లతో విద్యార్థులు విజ్ఞాన అనుభూతిని పొందారు. శనివారం ముగింపు కార్యక్రమం ఆర్‌ఎంసీ ఆవరణలో నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలతో విద్యార్థులు అదరగొట్టారు. కార్యక్రమంలో డాక్టర్ ఐవీ రావు మాట్లాడుతూ పరిశోధన ప్రధానంగా వైద్య విద్య కొనసాగాలని ఆకాంక్షించారు. వివిధ వ్యాధులు, వైరస్‌లు మూకుమ్మడి దాడులు చేస్తున్న తరుణంలో పరిశోధన ఆవశ్యకతను తెలిపారు. పరిశోధనతో కూడిన విద్యాబోధన చేయడం ద్వారా భవిష్యత్‌లో మెరుకల్లాంటి వైద్యులు రావడం ఖాయమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్యుడై ఉండి తగిన గౌరవం లేకపోవడం దురదృష్టకరమని అందుకు వ్యవహరించాల్సిన తీరు ను వివరించారు. మృదుస్వభావం, మాటతీరు, కరుణ వైద్యుడికి ఉండాల్సిన ప్రాథమిక లక్షణాలన్నారు. రోగికి వైద్యుడు చూపే ఆదరణే ఔషదమని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలన్నీ పాటిస్తే వైద్యుడికి సమాజంలో ఎనలేని గౌరవం దక్కుతుందన్నారు. డాక్టర్ లావణ్యకుమారి మాట్లాడుతూ భారతీ య వైద్యులకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంచి డిమాండ్ ఉందన్నారు. విషయ అవగాహన పెంపొందించుకుని పరిశోధనలవైపు అడుగెయ్యాలని సూచించారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ విషయావగాహన విద్యార్థుల్లో లోపిస్తే వైద్యుడు అవడానికి అర్హుడు కాదన్నారు. రంగరాయలో పలు ప్రయోగాత్మక విద్యాబోధనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ అరుణాదిత్య, ఆప్తాల్మాలజీ నిపుణుడు డాక్టర్ శ్రీరామ్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్‌ల ప్రసంగం కీలక ఆవశ్యకతలను పోషించింది. కోర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదాలో మెడికో హరికృష్ణ బృందం మూడురోజుల సదస్సును సమర్థవంతంగా నిర్వహించింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శశి, డాక్టర్ పి. ఉమామహేశ్వరరావు, డాక్టర్ సత్యవాణి, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ శైలజా ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులుగా వ్యవహరించారు. సదస్సులో భాగంగా వివిధ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు, బృందాలకు కళాశాల యాజమాన్యం మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేసింది. కార్యక్రమంలో భాగంగా వివిధ డిపార్ట్‌మెంట్‌లకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లు, మెమెంటోలు బహూకరించారు.

రెవెన్యూ ఉద్యోగులకు కంటి పరీక్షలు


కంటి వైద్య శిబిరంలో వైద్యులను సత్కరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరావు

కాకినాడసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని రెవెన్యూ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం కాకినాడ ఆర్డీవో కార్యాలయంలో ఉచిత కంటివైద్య పరీక్షలు నిర్వహి ంచారు. ఈ శిబిరాన్ని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు రెవెన్యూ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం శిబిరంలో ఆ యన కంటి పరీక్ష చేయించుకున్నారు. శిబిరంలో వివిధ మండలాలకు చెందిన సుమారు 450 మంది రెవెన్యూ ఉద్యోగులు, వారి కుటుంబీలకు కంటిపరీక్షలు చే సి మందులు అందజేశారు. అవసరమైన వారి కి కంటి శస్త్ర చికిత్సలకు సిఫార్స్ చేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసిన వైద్యులను డీఆర్వో వెంకటరావు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి డీబీఐ చైను లు, కాకినాడరూరల్ తహసీల్దార్ ఎస్ ఎల్ఎస్ కుమారి, ఆర్డీవో కార్యాలయ ఉద్యో గులు కేఎస్‌వీ సుబ్బారావు, కృష్ణ, దు ర్గాప్రసాద్, రమణమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాలయ అభివృద్ధి, పురోగతికి పేరెంట్స్ సహకారం అవసరం


నవోదయలో బాడీ ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం


పిఠాపురంలోని పాఠశాలలో విద్యార్థుల తండ్రులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం పేరెంట్ టీచర్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికలు జరిగాయి. 450 మంది పేరెంట్స్ హాజరయ్యారు. ఈసందర్భంగా పదిమందిని స్టూడెంట్ పేరెంట్ ప్రతినిధులుగా ఎన్నుకున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో వైస్ పిన్సిపల్ కె.రామకృష్ణయ్య, ఉపాధ్యాయు లు సనపల సత్యనారాయణ, డి.చక్రవర్తి, వి.జగన్మోహనరావు, వి.ప్రేమలత, మధుబాల తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురంలో ఘనంగా ఫాదర్స్ డే

పిఠాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని పాఠశాలల్లో శనివారం ఫాదర్స్ డే నిర్వహించారు. పట్టణంలోని భాష్యం స్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు జరిగాయి. పిల్లలతో తండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో తల్లిదండ్రులు పోషించే పాత్ర, వారి గొప్పదనం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, ప్రైమరీ హెచ్‌ఎం అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసలే ఇరుకు రోడ్డు... ఆపై ఆక్రమణలు...

● అస్తవ్యస్తంగా జీపీటీ కాలనీ డ్రైన్ల దుస్థితి
● వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు

కాకినాడసిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అడ్డూ అదుపూ లేకుండా ఇరుకు రోడ్లపై యథేచ్ఛగా ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. ఈ ఆక్రమణలను నియంత్రించాల్సిన యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. దీంతో డ్రైన్ల వెంబడి ఒక దాని వెంట మరొకటి ఆక్రమణలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. విషయానికి వస్తే కాకినాడ కరణంగారి సెంటర్‌లోని జీపీటీ కాలనీలో పలు రోడ్ల దుస్థితి ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఇక్కడున్న డ్రైన్లపై ఆక్రమణలతో ముంపు సమస్య తలెత్తుతోంది. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా గుడి రోడ్డులో డ్రైన్లపై ఆక్రమణలు పెరిగిపోయాయి. దీంతో పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడుతున్నారు. జీపీటీ కాలనీ ప్రాంతంలో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. కరణంగారి సెంటర్ ప్రధాన రోడ్డుకు సమాంతరంగా ఉన్న


సాయిబాబా గుడి రోడ్డులో ఆక్రమణలు


జీపీటీ రోడ్డు మలుపులో డ్రైన్ దుస్థితి

సాయిబాబా గు డిరోడ్డు మీదుగా ఎక్కువగా రాకపోకలు సాగుతుంటాయి. దీంతో ఇరుకుగా ఉండే సాయిబాబా గుడి రోడ్డులో ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అదేవిధంగా జీపీటీ మెయిన్ రోడ్డు డ్రైన్ మీదుగా ఆక్రమణలతో మురుగునీరు ప్రవహించక దోమల బెడదతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకుని పరిస్థితి చక్కదిద్దాలని కోరుతున్నారు.


ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం సుమారు 15వేల మందికిపైగా భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,45,190 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

గొల్లప్రోలులో గోవింద నామసంకీర్తన

గొల్లప్రోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో శనివారం గోవిందనామ నగర సంకీర్తన నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల్లో వెంకటేశ్వరస్వామి నామస్మరణ చేస్తూ ప్రదర్శనగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దాపురం మేజిస్ట్రేట్ కోర్టు ఏపీపీగా లీలా నాగరోజా

పెద్దాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆకుల లీలా నాగరోజా శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా పిఠాపురం మేజిస్ట్రేట్ కోర్టు నుంచి ఆమె పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. ఈమేరకు శనివారం కోర్టు హాల్లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, బార్‌కౌన్సిల్ సభ్యులు, పలువురు న్యాయవాదులు ఏపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠినచర్యలు

● పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటే కఠినచర్యలు తీసుకుంటామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణంలోని ఉప్పాడ బస్టాండు వద్ద శనివారం సాయంత్రం ఆటోడ్రైవర్లకు అవగాహన సద స్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుపై ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. వాహనం నడిపే సమయంలో మత్తు పానీయాలు, మద్యం సేవించరాదని సూచించారు. అనంతరం రహదారి భద్రతా నియమాలు పాటిస్తామని, మద్యం సేవించి వాహనం నడపబోమని ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ మణికుమార్ పాల్గొన్నారు.

విశ్వవ్యాప్తంగా విస్తరించిన భారత్ ఖ్యాతి

పిఠాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశ ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు తెలిపారు. పిఠాపురం పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో శనివారం బీజేపీ కార్యశాల నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు, నాయకులు బండే శ్రీను, గరగ వీరబాబు, లింగంపల్లి రవీంద్రబాబు, కె.నాగేశ్వరరావు, వి.రమణ, లక్ష్మరావు, శ్రీను, సలీం, నందకిషోర్, దొర్రై, అడబాల వీరమోహన్, సోషల్‌మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉడకబెడుతోంది

● చిరుజల్లులతో సరి ● ఉక్కపోతతో సతమతం

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ చెబుతున్నా ఎక్కడా కురవడంలేదు. చిరుజల్లులు పడి రోజంతా ఎండ వేడిమితో ఉడకబెట్టే వాతావరణంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న భిన్నమైన వాతావరణ పరిస్థితులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ సమాచారం ఇవ్వడంతో రెండు వారాలుగా ఎండతీవ్రతతో సతమతమైన ప్రజలు వాతావరణం చల్లబడుతుందని ఆశించారు. ఆకాశం మేఘావృతమై ఉండి ఎండ పొడతో ఉంటున్న వేడి వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పిఠాపురం, గొల్లప్రోలు సహా పలు ప్రాంతాలలో గరిష్ఠంగా 34-35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శుక్ర, శనివారాల్లో చిరుజల్లులు పడటం మినహా వర్షపుజాడ కనిపించడలేదు. జల్లులు పడిన తర్వాత, ముందు నెలకొన్న తీవ్రమైన ఉక్కపోతతో వృద్ధులు, చిన్నారులు అగచాట్లు పడ్డారు. ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక సతమతమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఇదే వాతావరణ పరిస్థితులు కొనసాగాయి. భారీ వర్షం పడి వాతావరణం చల్లబడాలని ప్రజలు ఆశిస్తున్నారు.

ఏపీపీగా లీలా నాగరోజా

పెద్దాపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆకుల లీలా నాగరోజా శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా పిఠాపురం మేజిస్ట్రేట్ కోర్టు నుంచి ఆమె పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. ఈమేరకు శనివారం కోర్టు హాల్లో ఆమె బాధ్యతలు స్వీకరించారు. బార్ కౌన్సిల్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ, బార్‌కౌన్సిల్ సభ్యులు, పలువురు న్యాయవాదులు ఏపీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఏరువాడ పర్వత శిఖరాన్ని అధిరోహించిన తులసిపాక వైద్య బృందం



గ్రామస్థులకు వైద్యం అందజేస్తున్న దృశ్యం

మోతుగూడెం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తులసిపాక పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఏరువాడ గ్రామంలో శుక్ర, శనివారా లు తులసిపాక వైద్యుడు డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి వైద్యశిబిరం నిర్వహించారు. అటవీ ప్రాంతం కావడంతో కొంత దూరం ట్రాక్టర్‌పై వెళ్లి, ఆ తర్వాత కొంత దూరం కాలినడకన గ్రామం చేరుకుని వైద్యసేవలు అందించారు. అక్కడ ఉన్న 25 కుటుంబాలకు వైద్యసేవలం దించారు. ప్రతి ఇంటికి మలేరియా నివారణకు ఐఆర్‌ఎస్ స్ప్రేయింగ్ నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులపై పలుసూచనలు చేశారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ అవగాహన కల్పించారు. కొండరెడ్లకు దుస్తులు, బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో జరిగిన ఆరు పెళ్లిలకు ముఖ్య అతిథులుగా డాక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గంగరాజు, హెల్త్‌అసిస్టెంట్ అంజిబాబు, అసిస్టెంట్‌లు నరేష్, ఫార్మాసిస్ట్ ధర్మా, హెల్త్ అసిస్టెంట్ శివుడు(ఏఎన్ఎం), ఆశావర్కర్ సుశీల, రాములమ్మ, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి, ఈఎంటీ ఫీడర్ సురేష్ ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



ఇందుకూరుపేట హైస్కూల్‌లో యోగా చేస్తున్న అధికారులు, నాయకులు

దేవీపట్నం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజూ 40 నిమిషాల పాటు యోగా చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తహశీల్దార్ కె.సత్యనారాయణ అన్నారు. శనివారం ఇందు కూరుపేట హైస్కూల్‌లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మం డల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఈనెల 21న యోగా కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు, మాగాపు బాబురావు, ముచ్చు వీర వెంకటసత్యనారాయణ, రేలంగి రాంబాబు, కుంజం శివదొర, ఎంఈవో, సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్, సిబ్బంది, ఎంఈవో, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మం



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

డలం మోతుగూడెంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని మోతుగూడెం ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఎస్కే. మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. శనివారం ఉదయం ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణంలో ఆయుర్వేద వైద్యుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సుమారు 40 మంది బీసీ కార్పొరేషన్ టైలరింగ్ సెంటర్ మహిళలు పాల్గొన్నారు.

యోగాంధ్ర ట్రయల్ రన్

వై.రామవరం: బొడ్డగండి, పాతకోట, కానివాడ, చింతలపూడితో పాటు దిగువ పరిధిలోని వై.రామవరం, చామగడ్డ, యార్లగడ్డ, కె.ఎర్రగొండ తదితర పంచాయతీలలో సచివాలయ పరిధుల్లో శనివారం యోగాంధ్ర ట్రయల్ రన్ నిర్వహించారు. ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో పలు పాఠశాలలు, కార్యాలయాల్లో ర్యాలీలు జరిపి యోగాసనాలు వేశారు. ఆరోగ్యానికి యోగా మార్గదర్శి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమాల్లో ఆయుష్ డాక్టర్ శ్రీహరి, ఎంపీటీసీ కరకా వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, హెల్త్, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బొడ్డగండి పంచాయతీలో యోగా ట్రయల్ రన్

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థుల తల్లులు

దేవీపట్నం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు 1, ఏనుగులగూడెం అగ్రహారం, ఆర్ అండ్‌ఆర్ కాలనీలో టీడీపీ మండల కన్వీనర్ మరిశెట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు వంటివి కూడా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి, ముచ్చు వీరవెంకట సత్యనారాయణ, రేలంగి రాంబాబు, ముచ్చు బాబురావు, రాచ శ్రీనివాసరెడ్డి, జారేపల్లి నాగరాజు, బొరగ సోమన్నదొర, తోకల చెల్లయ్య, కుంజం బుచ్చన్నదొర, అబ్బాయిరెడ్డి, రామిరెడ్డి, మంగమ్మ, చల్లారత్నం, వెంకన్నదొర, వీరపండు, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

దేవీపట్నం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదభీంపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో శనివారం ఎస్ఐ షరీఫ్ సిబ్బందితో తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 12 విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వివరించారు.

ఒకే కుటుంబంలో ఐదుగురికి తల్లికి వందనం



కిర్లంపూడి: గెద్దనాపల్లిలో తల్లికి వందనం పద్ద కుటుంబంతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెహ్రూ



రౌతులపూడి: లచ్చిరెడ్డిపాలెంలో తల్లికి వందనంపై ఆనందం వ్యక్తం చేస్తున్న కుటుంబం



జగ్గంపేట: చంద్రబాబు, పవన్‌కల్యాణ్,లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న తల్లులు

కిర్లంపూడి, జూన్14(ఆంధ్రజ్యోతి):గెద్దనాపల్లి గ్రామానికి చెందిన కోనా గణేశ్వరరావు రామతులసి దంపతుల ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం రూ.65వేలు జమకావడంతో తల్లిదండ్రులు ఆనందానికి అవధుల్లేవు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శనివారం వారి ఇంటి వెళ్లి పిల్లలు ధనలక్ష్మి, దినేష్, ధనుష్, రాము, లక్ష్మణ్‌ను, తల్లిదండ్రులను పలకరించి చదువుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే నెహ్రూకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, భూపాలపట్నం ప్రసాద్, సూరిశెట్టి వెంకటశివ, బొదిరెడ్ల సుబ్బారావు తదితరులు ఉన్నారు.

నలుగురికి 'తల్లికి వందనం'

రౌతులపూడి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): లచ్చిరెడ్డిపాలేనికి చెందిన పందరాడ సింహాచలం కుటుంబంలో నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద రూ.52వేలు వచ్చింది. పందరాడ వర్ధన్‌కుమార్ 3వ తరగతి, దుర్గాప్రసాద్ 6వ తరగతి, రాధాకృష్ణ 8వ తరగతి, సూర్యం 9వ తరగతి చదువుతోన్నారు. దీంతో ఆ కుటుంబం కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది.

తల్లికి వందనంపై హర్షం

జగ్గంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లో జమకావడంతో జె.కొత్తూరులో నియోజకవర్గ టీడీపీ యువత ఉపాధ్యక్షుడు బద్ది సురేష్ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాన్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.

బాధిత కుటుంబానికి చేయూత

ఏలేశ్వరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానికక్వారీపేటలో ఇటీవల పూరిల్లు దగ్ధం కావడంతో బాధితుడు దెయ్యాల రాజు కుటుంబానికి హెల్పింగ్‌యూత్ సభ్యులు రూ.12వేలు విలువైన సామగ్రిని శనివారం అందజేశారు. మంచం, 25కిలోల బియ్యం,ఫ్యాన్, వంట సామగ్రి, నగదు అందజేశారు. మద్దుల స్వరూప్, ఆలీషా, సతీష్, శివాజీ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. యర్రవరంలో ఇటీవల తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించడంతో అనాథ విద్యార్థికి జనసైనికుడు గంగిరెడ్ల మణికంఠ బృందం రూ.5వేలు అందజేశారు.

నీట్‌లో 532వ ర్యాంక్ సాధించిన వైష్ణవి



ఏలేశ్వరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెద్దనాపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి వైష్ణవి (నీట్)లో 532వ (ఈడబ్ల్యూఎస్ 33) ర్యాంక్ సాధించింది. తండ్రి సుబ్రహ్మణ్యం వ్యవసాయదారుడు, తల్లి గృహిణి. మంచి ర్యాంక్ రావడంపై సంతోషంగా ఉందని, ప్రణాళికాబద్ధంగా చదివానని, వైద్యురాలు కావడం తన లక్ష్యమని వైష్ణవి తెలిపింది.

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

జగ్గంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్‌కు వచ్చినసమాచారం మేరకు జగ్గంపేట ఎస్ఐ రఘునందన్‌రావు, సిబ్బందితో జగ్గంపేట శివారు పోలవరం కాలువ పక్కన దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.10వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

స్మార్ట్‌ఫోన్ల వితరణ



స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తుని మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలో అంధులైన బాల బాలికలకు రూ.20వేలు విలువైన స్మార్ట్‌ఫోన్లను ఏక్ కదం ఔర్ ఫౌండేషన్, ఇండియన్ ఆయిల్ కంపెనీలు కలిసి అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుని సీనియర్ అడ్వకేట్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ప్రగడ చక్రి హాజరయ్యారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎం.శ్రీను, సాయిరాం, చంద్రకిరణ్, సాయి అచ్యుత్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

కిర్లంపూడి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మండలంలోని గ్రామ పెద్దలకు సైబర్ నేరాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ జి.సతీష్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్ కె.శ్రీనివాస్ హాజరయ్యారు. శక్తి యాప్ వల్ల ఉపయోగాలు, పబ్లిక్ ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

విమాన ప్రమాద ఘటనపై శాంతి ర్యాలీ



అన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అన్నవరం, మే 14 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతిచెందిన వారికి అన్నవరంలో వైసీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శనివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి గాంధీ విగ్రహం వరకు శాంతిర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ కుమార్‌రాజా, సరమర్ల మదుబాబు, రాయి శ్రీను, బీఎస్‌వి ప్రసాద్, గణేశుల బాబ్జి బత్తుల రవికుమార్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో భారీ వర్షం



ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో చిన్నపాటి చెరువులా మారిన వర్షంనీరు

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్, చిట్టికొండ నర్సింగ్‌హోం, అల్లూరి సీతారామరాజు సెంటర్, బస్టాండ్ సెంటర్లు జలమయమయ్యాయి. జాతీయ రహదారిపై ప్రయాణించిన ద్విచక్రవాహనదారులు తడిసి ముద్దయ్యారు.

గొప్ప పరిపాలనా దక్షుడు చంద్రబాబు



ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గొప్ప పరిపాలనా దక్షుడు సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికివందనం నిధులు జమ చేసి కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా పథకం అమలు జరిగిపోవడంతో వైసీపీ నాయకుల నోట మాట రావడం లేదని, దీంతో సోషల్ మీడియాలో అసత్యప్రచారం చేశారన్నారు. తమ నేత నారా లోకేశ్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని, దీనిపై దమ్ముంటే వైసీపీ నాయకులు నిరూపించాలని దివ్య సవాల్ విసిరారు. పథకాల్లో డబ్బులు కాజేసే అలవాటు వైసీపీ నాయకులదే అన్నారు. వైసీపీ ప్రభుత్వం 42లక్షల మందికి అమ్మఒడి ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27లక్షల మందికి తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ చేస్తుందన్నారు. ప్రజల సంక్షేమం కోరే ప్రభుత్వం దీనిని ఆధారంగా అర్థమవుతుందని ఆమె తెలిపారు.

సత్యదేవుడికి వేడుకగా ప్రాకార సేవ



తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

అన్నవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. పూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. ఈవో వీర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి: యనమల



అధికారులతో మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తునిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయంతోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తెలిపారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శనివారం యనమల సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2024 వికసిత్ భారత్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్‌వన్‌గా నిలిచే 10సూత్రాలకు తగ్గట్టుగా అధికారులు పనిచేసి తుని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలన్నారు. మోడల్ నియోజకవర్గంగా తుని రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత చాటుకునేలా పాలకులతో కలిసి అధికారులు పనిచేయాలన్నారు. ఆక్వా, హార్టికల్చర్, ఇండస్ట్రీ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ ఆ దిశగా పనిచేయాలని యనమల ఆదేశించారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలిక కేసును 12గంటలోపు ప్రత్తిపాడు పోలీసులు ఛేదించారు. ధర్మవరానికి చెందిన 15ఏళ్ల మెర్సీగోల్డ్ ఈనెల12న మధ్యాహ్నం ఇంటి వద్ద నుంచి అదృశ్యమైంది. శుక్రవారం రాత్రి 10గంటలకు ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. దీనిపై సీఐ బి.సూర్య అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం, సిబ్బంది ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి సమీప మండల గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం ఎస్ఐ లక్ష్మీకాంతం కిర్లంపూడి మండల పరిధిలోని గ్రామంలో చాకచక్యంగా బాలికను పట్టుకున్నారు. బాలికను పోలీస్‌స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈసందర్భంగా ఎస్ఐను డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూర్యఅప్పారావు, ఉన్నతాధికారులు అభినందించారు.

ఎమ్మెల్యే జ్యోతుల పరామర్శ



ఏలేశ్వరంలో రామన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

ఏలేశ్వరం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం తిమ్మరాజు చెరువు నీటి సంఘం మాజీ డైరెక్టర్ సామంతుల రామన్న మృతికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సంతాపం తెలిపారు. రామన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామన్న కుమారులు శ్రీకృష్ణ, భాస్కరరావును శనివారం ఎమ్మెల్యే పరామర్శించారు. ఏలేశ్వరం సొసైటీ సీఈవో జ్యోతుల శ్రీనివాస్ కుమారుడు తేజ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో శ్రీనివాస్‌ను నెహ్రూ పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్లు అలమండ చలమయ్య, మూది నారాయణస్వామి, సామంతుల గోపి, శిడగం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కిర్లంపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గెద్దనాపల్లికి చెందిన మాజీ ఎంపీటీసీ బిశెట్టి సూరిబాబు సోదరుడు శివ ఇటీవల మరణించడంతో శనివారం ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సూరిశెట్టి వెంకటశివ, కాళ్ల వెంకటేష్, సూరిశెట్టి శ్రీను, ముల్లేటి గంగారావు, పెదకంశెట్టి మల్లారావు, మొయిళ్ల అప్పారావు ఉన్నారు.

వికాస్ పరిషత్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

తునిరూరల్, జూన్14(ఆంధ్రజ్యోతి): తునిలో భారత్ వికాస్ పరిషత్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. అధ్యక్షుడిగా గాజుల వేణుగోపాలస్వామి, కార్యదర్శిగా నెల్లిపూడి నాగేశ్వరరావు, కోశాధికారిగా నెల్లిపూడి రాజబాబు, ప్యాట్రన్‌గా చదరం శివాజీ, వైస్ ప్రెసిడెంట్‌గా అశిన సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా కెడేనియల్ జోసెఫ్, ఇతర ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధూళిపాల పురుషోత్తమ శాస్త్రి, సౌత్ జనరల్ సెక్రటరీ హాజరయ్యారు.

గొల్లప్రోలులో గోవింద నామసంకీర్తన

గొల్లప్రోలు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో శనివారం గోవిందనామ నగర సంకీర్తన నిర్వహించా రు. పట్టణంలోని పురవీధుల్లో వెంకటేశ్వరస్వామి నామస్మరణ చేస్తూ ప్రదర్శనగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ప్రత్తిపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు బజారువీధి రామాలయం వద్ద శనివారం సదా మీ సేవలో స్వచ్ఛంధ సేవా సంస్థ నిత్యావసరాలు పంపిణీ చేసింది. పడాల శ్రీనివాసరెడ్డి ఈకిట్లను పేద విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు సలాది కృష్ణ, సత్యానందం, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు అందజేత

ప్రత్తిపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం సిరిపురానికి చెందిన మనం ఫౌండేషన్ నిర్వాహకుడు మానూరి లతగంగరాజుల కుమారుడు ప్రణీత్ శనివారం ప్రత్తిపాడు, పరిసర గ్రామాల్లో నిరుపేదలు, భిక్షాటకులకు దుస్తులు, ఆహారాన్ని అందజేశారు.

నేడు తునిలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

తుని రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తునిలో గాయిత్రి డిగ్రీ కళాశాలలో ఆదివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంఎస్ఎన్ లేబరోటరీ హైదరాబాద్ వారితో నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలకు ఇంటర్, డిగ్రీ పాసైన వారు హాజరుకాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



తుని రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. తుని పెద్ద గేటు ఎదురుగా రైలు పట్టాల వద్ద రాజమండ్రి వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఓ రైలు ఢీకొనడంతో 65ఏళ్ల వ్యక్తి మరణించాడు. ఈసంఘటనపై తుని రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేశారు. మృతుడు వివరాలు తెలియలేదని, మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే రైల్వే ఎస్ఐను సంప్రదించాలన్నారు.

16న వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

జగ్గంపేట, జూన్14(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గోకవరం కామరాజు పేట గ్రామానికి చెందిన అడప భరత్‌కుమార్‌జూన్ 16న ప్రమాణస్వీకార మహోత్సవం రాజమండ్రి రోడ్‌లో గల పరిణయ ఫంక్షన్ హాల్లో జరగనుంది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను ఆహ్వానించారు.

తునిలో రక్తదాన శిబిరం



రక్తదానంలో పాల్గొన్న యువకులు

తుని రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని తుని, పాయకరావుపేట ఎన్‌బీఎఫ్‌సీ కంపెనీల ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు. ఏటా 2, 3 సార్లు రక్తదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడిన చెక్కా శ్రీరామ గుప్తా, గోళ్ళ వెంకటేశ్వరరావు, కర్రి వెంకటేశ్వరరావులను తుని, పాయకరావుపేట బ్లడ్ వలంటీర్స్ టీం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఏరియా ఆసుపత్రి ఆవరణలో ఈకార్యక్రమం జరిగింది.